# మీవారేం చేస్తుంటారు

ఈ ప్రశ్న మళ్ళీ మళ్ళీ మళ్ళీ ఎన్నిసార్లు ఎదుర్కోవాలి తను ఏం చెప్పగలదు సమాధానం?

కానీ.....?

ప్రశ్న సృష్టిస్తున్న సమస్యకి సమాధానం చెప్పగలగడం పరిష్కారం కాదు.

మరి....?

కిటికీ లోంచి తెల్లగా వెన్నెల మెరుస్తోంది.

ఆ వెన్నెల్లో ప్రకృతి.... రక్తం లేక పాలిపోయిన శరీరంలా తెల్లగా నిర్జీవంగా.

దూరం నుంచి సముద్రపు హోరు వినిపిస్తోంది. ఆగి ఆగి ఎవరో దుఃఖాన్ని గుండెల్లో పాతుకుని. ఇక వీలుకాక పైకే తెరలుగా ఏడుస్తున్నట్టు.

నళిని తనను ఆమెకి పరిచయం చేసింది.

"నాఫ్రెండ్ సరళ కుమారి. ఫ్రీలాన్స్ జర్నలిస్ట్"

"ఓ వెరీ హాపీ టు మిట్‌యూ.....ఆమధ్య మీ బుక్ వకటి చదివినట్టు గుర్తు....శ్రీమతి సరళాకుమార్ అంటే మీరే కదూ. రియల్లీ ఐ ఎంజాయ్డ్ రీడింగ్..... 'మహా మహిళలు' అను కుంటాను. ఆ పుస్తకం పేరు..... ఆ పుస్తకం రాసింది మీరే కదూ?"

"అవును కాని....."

"బాగుంది కాని..... మదాంక్యూరీ, వర్జీనియా వుల్ఫ్. మేధా పాట్కర్..... ఇలా చాలా మంది గురించి రాశారు. కాని ఇందిరా గాంధీ గురించి రాయలేదు?

ఇందిరా గాంధీ గురించి తన అభిప్రాయం చెప్పడానికిది సమయం కాదు. ఏమీ మాట్లాడకుండా వుండటం కూడా అంత మంచిది కాదు. గబ గబా ఆలోచిస్తోంది సమాధానం కోసం.... సరళ

ఇంతలో పేలింది అగ్నిపర్వతం ..... లాంటి ప్రశ్న! మిసెస్ శారదామోహన్ ప్రశ్న!

తన ముఖంలో రంగులు మారడం నళిని గమనించి వుంటుంది.

"మిసెస్ మోహన్.....సలోమీ ఈజ్ వెయిటింగ్ ఫార్‌యూ" అని పక్కకి లాగింది ఆమెని తెలివిగా

"హాయ్ షేర్దా....... ఐ మిస్ యూ దీస్ డేస్" అంటూ మరో ఆమె మెసెస్ శారదా మోహన్‌ని లాక్కుపోయింది.

గుండెల మీంచి ఏదో పెద్ద బరువు దించినట్టు తేలిగ్గా నిట్టూర్చింది తను–

నళిని కూడా చాలా ఫీలయ్యింది.

"సారీ సర్లా.... జస్ట్ ఊరికే పరిచయం చేశాను. ఆవిడ అంత త్వరగా అలాంటి ప్రశ్న వేసి నిన్ను గాయపరుస్తుందను కోలేదు."

"ఫరావాలేదు...." అనేసి తను గబ గబా అక్కణ్ణించి దూరంగా వెళ్ళింది.

ఆ హాల్లోంచే వచ్చేద్దామనుకుంది. కాని ఎటికపీ కాదు. పైగా తాను వచ్చిన పని.....

ఐస్‌క్రీమ్ తింటూ తన తోటి పిల్లలతో ఆడుకుంటోంది సృజన.

పూనే నుంచి వచ్చిన ప్రముఖ సంఘసేవకురాలు నీలమణి కేల్కార్ గార్ని లయన్ లేడీస్ సన్మానిస్తున్నారు. తను న్యూస్ కవర్ చెయ్యాలి. వీలయితే ఆమెని ఇంటర్వ్యూ చెయ్యాలి.

ఓ గంట ఆలస్యంగా వచ్చింది నీలమణి కేల్కర్. సుమారు యాభైయేళ్లుండచ్చు. స్త్రీల సమస్యల గురించి గంటకు పైగా ఇంగ్లీషులో ఉపన్యసించింది. ఎమర్జెన్సీ కాలంలో జైలులో గడిపింది. ఇందిరాగాంధీని తీవ్రంగా విమర్శించింది. స్త్రీలలో విద్యావ్యాప్తికి ఆమె చేస్తున్న గణనీయమైన సేవలకు గత సంవత్సరం భారత ప్రభుత్వం పద్మశ్రీ బిరుదు ఇస్తానంటే వద్దని తిరస్కరించింది. స్త్రీల పట్ల వివక్షత చూపుతున్న ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా విమర్శించింది.

సరళకి ధైర్యం వచ్చింది. తను అనవసరంగా బాధపడ్డానేమో అనుకుంది. మిసెస్ శారదా మోహన్ ప్రశ్నకి సమాధానం చెప్పి వుండవలసింది. తను మరింత ధైర్యం మొండితనం అలవరచుకోవాలి.

గతం కళ్లముందు కదిలి గుండె బరువెక్కింది.

ఏం తప్పు చేసింది తను?

అప్పుడూ చెయ్యలేదు.

ఇపుడూ చెయ్యడంలేదు.

ఉపన్యాసానంతరం నీలమణి గారితో పరిచయం చేసుకుంది. తన విజిటింగ్ కార్డు చూసి చాలా ఆసక్తి కనపరిచిందామె. రేపు కూడా తను వూళ్లోనే వుంటాననీ, సాయంత్రం బాగా పొద్దు పోయేక తనను కలవచ్చనీ చెప్పిందామె. తను ఎవరి దగ్గర బస చేస్తున్నాదో. ఎలా రావాలో చెప్పిందామె. వాళ్ల ఇంట్లో బహుశా ఫోనులేదనుకుంటానని నవ్వింది.

"విద్యానగర్ కాలనీ నాకు బాగాతెలుసును. రేపు సాయంత్రం బాగా పొద్దుపోయేక ఏడున్నర. ఎనిమిది గంటలకి రమ్మంటారా?" అన్నది సరళ సంతోషంగా.

"తప్పకరండి అప్పటికి నేను ఇంటి దగ్గరే వుంటాను. ఒకవేళ నేను రావడం కొంచెం ఆలస్యం అయినా దయచేసి వెయిట్ చెయ్యండి" అన్నది నీలమణి.

సరళ మనసులో బాధ ఎండలో మంచు కరిగిపోయినట్టు కరిగి మాయమైపోయింది.

కిటికీ లోంచి తెల్లగా వెన్నెల మెరుస్తోంది. ముత్యాలు ఆరబోసినట్టు .

దూరం నించి సముద్రపు హోరు వినిపిస్తోంది. ఆగి, ఆగి. ఆ నిశ్శబ్దపు ధ్వని ఆకాశమూ, భూమీ కలిసి పాడుకుంటున్న మౌనగీతంలా వుంది.

సరళకి కవిత్వం రాయడం రాదు.

కథలు రాయడం రాదు.

వ్యాసాలు రాస్తుంది.

అవి చాలా శక్తివంతంగా వుంటాయట. చివరకి వచ్చేసరికి పొంగుతున్న లావాలా వుంటాయట...... నళిని. మనోరమా, మున్నీ కూడా అలాగే అంటారు. సత్యమూర్తి గారూ అలాగే అంటారు. నిజానికి ఆయన తనచేత చాలా మంచి వ్యాసాలు రాయించారు.

"మీ పత్రిక కోసం నీలమణి గార్ని ఇంటర్వ్యూ చేస్తున్నారు! ఆ ఇంటర్వ్యూ లోని విశేషాలే ఉపయోగించి మా పత్రిక కొరకు వ్యాసం రాయండి" అన్నారాయన.

ఆయన 'అవగాహన' పక్షపత్రిక ఎడిటర్. పబ్లిషర్. అండ్ ప్రింటర్ బాగా పట్టుదలతో నడిపించుకొని వస్తున్నారు. సర్క్యులేషన్ మహా వుంటే మూడువేలు వుంటుందేమో– ఆయన దగ్గిర్నించి డబ్బులు పుచ్చుకోవాలంటే కష్టంగా వుంటుంది. కాని ఒకోసారి ఆ డబ్బులే తనని ఆదుకుంటాయి.

నిర్మల తాతగారి దగ్గిర చదువుకుంటున్నది. స్నేహలతా. సృజనా తన దగ్గరే వున్నారు. సృజన ఇక్కడే పుట్టింది.

ఆ రోజు ఎంత బాధ అనుభవించింది!

ఎంత క్షోభ అనుభవించింది. చచ్చిపోతానేమో అనుకుంది. చచ్చిపోతే బాగుణ్ణనుకుంది. చచ్చిపోతే ఎలా అనుకుంది. తన రక్తం పంచుకుని, తన పేగు తెంచుకుని. తన ప్రాణం పోసుకుని పుట్టిన చిన్నారుల కోసం చచ్చిపోకూడదనుకుంది.

'మళ్లీ ఆడపిల్లే పుట్టిందా?' అన్నారందరూ...

'అయ్యో మళ్లీ ఆడపిల్లేనా? అనుకుంది తనూను.

ఈ జీవితంలో ....... కాదు ఈ ప్రపంచంలో తనలాగే నానా బాధలూ పడడానికొచ్చిన మరో ఆడపిల్ల!

లేదు భయం భయం లేదు. తను పెంచుతుంది. తన సర్వ శక్తులూ ధారపోసి పెంచుతుంది. ఈ మగ ప్రపంచాన్ని ధిక్కరించి పెంచుతుంది. ఈ మగ ప్రపంచాన్ని ధిక్కరించేలా పెంచుతుంది.

తను ఏనాడో నిర్ణయించుకుంది.

ఇపుడు మరోసారి నిర్ణయించుకుంది.

తనికి కోర్టులూ. సాక్ష్యాలూ, ప్లీడరూ ఎందుకూ? ఇదంతా నటన.... ఇవి స్త్రీలని రక్షించిన దాఖలాలు లేవు.... ఈ కోర్టులు నటన.... ఈ చట్టాలు నటన. ఈ రాజ్యాంగం నటన..... ఆడదాని పాలిటికి ఇవన్నీ మాయ..... మోసం.... దగా.....

కిటికీలో వెన్నెల తగ్గిపోయింది. కగ్గిపోయిన వెండిలా తెలుపు తగ్గిపోయింది.

సముద్రం పాడుతూనే వుంది.

తను కావాలని చేసుకుంది గనకనా ఆ పెళ్ళి! లేదు. కాని వద్దని గట్టిగా చెప్పలేదు.

తన భావాలకి అనువైన మనిషేనని అందరూ అంటే సరేలే సంతోషమేననుకుంది.

దిగందే ఎలా తెలుస్తుంది, మగవాడి లోతు!

ఒకనాటి కమ్యూనిస్టు....... ఈనాటి కాంట్రాక్టరు కోటేశ్వర్రావు గారబ్బాయి. ఉద్యోగం వచ్చింది. రోడ్లు మరియు భవనాల శాఖలో.

కుమార్ ఎత్తు అయిదడుగుల పదంగుళాలు. రాగి కలిపిన బంగారం వంటి ఎరుపు ఒత్తుగా వంకీలు తిరిగిన జుట్టు-ఆడపిల్ల అందాన్ని గుచ్చి గుచ్చి చూస్తున్నట్టు సూదిగా ముక్కు. మగసిరికి చిహ్నంగా అందమైన మీసం–" ఏ సినిమా'యాక్టరూ చాలడు" అతని ముందు!

ఆడపిల్లలు వెనక్కి తిరిగి చూస్తారు. కొందరు ఆగిపోయి చూస్తారు. మరికొందరు సిగ్గుపడుతూ దొంగ చూపులు చూస్తారు.

సరళ కుమార్‌ని వెనక్కి తిరిగి చూడలేదు. ఆగిపోయి చూడలేదు. దొంగచూపులు చేడలేదు కాపీ కప్పు అందిస్తూ మామూలుగానే చూసింది. ఫరవాలేదు అందంగానే వున్నాడనుకుంది.

కుమార్ కమ్యూనిజం గురించి ఎలా మాట్లాడగలడో తావీజుల గురించి అలాగే మాట్లాడగలడనీ. భగత్సింగ్‌ని, అల్లూరి సీతారామరాజును, కీర్తించిన నోటితోనే ఇందిరమ్మనీ రాజీవ్ గాంధీని కూడా పరవశంతో పొగడగలడనీ, స్త్రీలపై అత్యాచారాల గురించి చాలా బాధతో మాట్లాడినట్టే. కనిపించిన ప్రతీ ఆడపిల్ల గురించి 'బూతులు' (అవును పచ్చి బూతులే!) మాట్లాడగలడనీ తెలుసుకునే సరికి పెళ్ళయి ఏడాదయింది. పైగా మూడోనెల!

ఎన్ని రోజులయినా ఏమీ తినకుండా ఉండ గలిగినట్టే రోజుల తరబడి అదే పనిగా తినగలడనీ, చీమని చంపడానికొక్కడా ఇష్టపడని కరుణామయహృదయుడే. పచ్చి రక్తం తాగగల కర్కోటక హృదయుడనీ.

ఆడదాన్ని పువ్వుకంటే సున్నితంగా చూచుకొన్నట్టే. మహాకసిగా క్రూరంగా చచ్చిపోతున్నాకూడా, జాలి పడకుండా అనుభవించగలడనీ తెలిసేసరికి రెండో కూతురు కూడా పుట్టింది.

జ్ఞాపకం వస్తేనే వళ్ళంతా భయంతో వణికిపోతుంది.

ఆ రాత్రి తన జీవితంలో కాళరాత్రి.

సాయంత్రం ఆరయ్యేసరికి ఇంటికివచ్చేశాడు. చాలా బెంగాలీ బాబులా లాచ్చీపైజమా వేసుకున్నాడు.

'ఇవ్వాళ యింట్లో పార్టీ ఉంది' అన్నాడు.

సరళకి గుండెల్లో రాయిపడింది.

ఏడు గంటలకి ఒకాయన వచ్చాడు. నల్లగా పొట్టిగా వున్నాడు. ఇద్దరూ మేడ మీద గదిలోకి వెళ్ళారు. మరో పది నిమిషాల్లో మరో ఇద్దరొచ్చారు. ఎనిమిది గంటలకి ప్రారంభమయింది. 'సురాపాన యజ్ఞం' అనబడు 'దిగ్రేట్ డ్రింకింగ్ పార్టీ'

ఫ్రిజ్ తెరచి ఐస్ క్యూబ్స్ పట్టుకు వెళ్ళాడు.

'జీడిపప్పు యించి పట్రా' అంటూ గబగబా మేడమెట్లెక్కి వెళ్లిపోయాడు.

అది మీరరాని ఆజ్ఞ.

మరో పది నిమిషాల్లో బెల్ మోగింది.

ఈ బెల్ ఒకటి తన ప్రాణం మీదకి.

బంట్రోతుని పిలిచినట్టు బెల్‌కొట్టి పిలుస్తాడు.

నెయ్యి వేసి కొద్దిగా కారం ఉప్పూ జల్లి వేయించాలి జీడిపప్పు.

బెల్ వినగానే గబగబా వేపుతున్న జీడిపప్పు పింగాణీ ప్లేట్లో పెట్టి మూడు గరిటెలు వేసి. ట్రేలో సర్ది పెట్టుకొని మెట్లెక్కుతుంటే మళ్ళీమోగింది బెల్. గబగబా మెట్లెక్కి, చివరమెట్టు దగ్గర నుంచుని మెల్లగా దగ్గింది. గాజుల చప్పుడు చేసింది.

వచ్చాడు. కర్టెన్ తొలగించుకొని.

లోపలి నుంచి నీలి రంగు కాంతి బయటకి కనిపిస్తోంది.

ప్లేటు అందుకుంటూ గాలిలోంచే తన పెదవుల వేపు ఆకలిగా చూస్తూ ఓ ముద్దు విసిరాడు.

ఛీ! లోపల్నించి వాళ్ళు చూశారో ఏమో-

పైట నిండుగా కప్పుకొని గబగబా మెట్లు దిగింది.

తొమ్మిదవుతోంది.

ఆకలవుతోంది.

భోజనం చేసేస్తే.....

ఇంట్లోనే ఉన్నాన కదూ-కాస్త ఆగలేక పోయావా-అంటాడు.

ఇప్పుడు నేనొక్కణ్ణే తినాలి. కంపెనీ కోసమేనా వెయిట్ చెయ్యవలసింది అంటాడు.

నీతో కలిసి తింటే నాకదో ఆనందం అంటాడు.

నే నొక్కణ్ణి తినాలా? నాకు తినాలనిపించదు అంటాడు.

ఇంకా ఏమేమో అంటాడు.

ప్రేమగా అంటున్నాడో, దెప్పుతున్నాడో తెలీదు.

ఆకలవుతోంది-

ఎప్పటికవుతోందో. ఆ-దిక్కుమాలిన పార్టీ-

తొమ్మిదింపావు-తొమ్మిదిన్నర-పది- బెల్ వినపడి తుళ్లిపడీ కళ్లు తెరిచింది-

నీరసంతో డైనింగ్ టేబుల్ దగ్గిరే కునికి పాట్లు పడుతుంది.

మెల్లిగా మెట్లెక్కుతూ వెళ్ళింది-

'సారీ సర్లా-ఓనాలుగు ఆమ్లెట్లు వేసి తెచ్చిపెట్టు- ఇదుగో - ఓవేళ ఆలస్యం అవుతుందేమో- ఆకలేస్తే నువ్వు భోజనం చేసేయ్-'

ఆమ్లెట్లు వేసి ఇచ్చి వచ్చి- భోజనంచెయ్యబోయింది. పదిన్నర-ఎందుకో తినలేక పోయింది- కలుపుకున్న అన్నం కంచంలోనే వదిలేసి ఇంత మజ్జిగ తాగి మంచం మీద వాలింది.

పక్క గదిలో చిన్నపాప ఏడుస్తోంది.

నిద్రకళ్ళతోనే లేచి చిచ్చి కొట్టి నిద్రపుచ్చి వచ్చింది.

పదకొండున్నర-

నిద్ర ముంచుకొచ్చేస్తోంది-

తను నిద్రపోతోంది-

మాటలు వినిపిస్తున్నాయి.

"నిన్ను లేపి డిస్టర్బ్ చెయ్యడం ఎందుకని నేనే వడ్డించుకుంటున్నాను-"

"సర్లా..... సర్లా...... ఆవకాయ సీసా ఏది-"

"ఎంత తొందరగా ముగిద్దామనుకున్నా పన్నెండున్నరయింది. అయినా సరదాగా మందు తాగేప్పుడుకూడా కంగారు దేనికిలెద్దూ"

చెయ్యి కడుక్కుంటున్నట్టున్నాడు-

పిల్లలగదికీ తమగదికీ మధ్య ఉన్నతలుపు వేసిన చప్పుడు.

ఫాన్ స్పీడ్ పెరిగింది-అబ్బా చేతులు చల్లగా ఉన్నాయి.

ఆ వాసనేమిటో-తల తిరిగిపోతోంది-

వొద్దు-వొద్దు-ప్లీజ్-

వినడు- వినడు-

ఇష్టం లేకపోతే ఆడగాడిద మగగాడిదని కాళ్ళతో తంతుంది-

మనుషులు ఎప్పటికైనా జంతువులంత చక్కగా బ్రతగ్గలరా-

తల తిరిగి పోతోంది- అన్నం సరిగ్గా తినలేదుకూడాను-నీరసం నీరసం- అమ్మా- అమ్మా- అమ్మయ్య- అయింది- బరువు దిగింది-

వెనక్కి తిరిగి ముడుచుకు పడుకుంది.

బాత్రూంకి వెళ్ళొస్తే బాగుణ్ను- ఓపిక లేదు-

కాస్సేపు పోయాక మళ్ళీ లేపుతున్నాడు.

మీకు దణ్ణం పెడతాను ప్లీజ్- వొద్దు- వొద్దండీ- ప్లీజ్! పెనుగులాడుతోంది-

రేప్ గురించి సినిమాల్లో చూడ్డమేగాని ఇవ్వాళ ఆ సన్నివేశం ఎదురైంది- కానీ తను అలా తిరగబడలేదు- చేతికి ఏది దొరికితే దానితో కొట్టలేదు- గట్టిగా అరవలేదు- పక్కగదిలో పిల్లలు నిద్రపోతున్నారు-

టైం రెండయిందో మూడయిందో-

ఎంత హింస- ఎంత హింస-

ఆ మనిషికి ఏమిటో ఆ ఆనందం-

సెక్స్ ఇంత నీచంగా, ఇంత అసహ్యంగా, ఇంత క్రూరంగా, ఇంత భయంకరంగా వుంటుందా-

హబ్బ- హబ్బాహ్- హమ్మయ్య-!

ఇకనైనా పడుకోనిస్తే అదే పదివేలు-!

లోగడ ఒకసారి ఇలాగే చేస్తే గట్టిగా చెప్పేసింది- చెంప దెబ్బలు తిన్నది-

మర్నాడు మళ్ళీ బ్రతిమాలడం!

ఛీ- సిగ్గులేదు ఈ మొగమొహాలకి-

ఎవరితో చెప్పుకుంటుంది- ఏమని చెప్పుకుంటుంది. మూడురోజులు మంచం దిగలేదు. జ్వరం- వళ్ళంతా నొప్పులు-తల పగిలిపోయే తలనెప్పి-

మూడో రోజున చెప్పింది నీరసంతో-

మా ఇంటికి వెళతాను- అమ్మనూ నాన్ననూ-చూడాలని ఉంది- అని చెప్పింది ఎటో చూస్తూ.

నవ్వేడు!

ఏం నవ్వు నవ్వేడు!

నువ్వింకా చిన్న కూచివా అన్నాడు గారంగా.

ఇంకా అమ్మా నాన్న అంటావేమిటి అన్నాడు ఆశ్చర్యంగా-

తొందరగా వచ్చేస్తావు కదూ! అన్నాడు ప్రేమగా-

అబ్బో ఎంత సరసం మళ్ళీ-

రానంది.

తగవు పెట్టు కోవడానికి సిద్ధంగా వుంది.

దాంతో తగ్గిపోయాడు. తేలగొట్టేశాడు.

నవ్వేశాడు. జోకులు వేశాడు.

అంతే– వచ్చేసింది, అక్కణించి

అమ్మ విని ఎంత ఏడిచిందో-

ఒక బాధయితే ఫరవాలేదు- పడొచ్చు- కానీ అన్ని బాధలెలా పడటం-

డబ్బులు లెక్కపెట్టుకు చూస్తాడు. నువ్వు తీశావా అనడుగుతాడు

లేదంటేవినడు

దొంగని చూసినట్లు చూస్తాడు.

తన చీరల మడతల్లో వెదుకుతాడు

ఛీ ఏంబుద్ధి !

తనకి స్నేహితులు రాసిన వుత్తరాలు చదువుతాడు.

ఓ నాడు - ఎవరీకృష్ణ అని కేకలు

మాఫ్రెండ్ క్రిష్ణవేణండి- దాన్ని మేం కృష్ణ అంటాం. ఇప్పుడు వాళ్ళాయనా కూడా అంటున్నాట్ట.' అని చెప్పింది

నమ్మడు.

తనవ్యాసాలు పత్రికల్లో చదివి ఒకోసారి అభిమానులు వెతుక్కుంటూ వస్తారు.

ఎన్నో సంగతులు చర్చిస్తారు ఒకోసారి సంభాషణ చాలా సేపు సాగుతుంది.

అది కుమార్ కి ఇష్టంఉండదు.

" లెనిన్ ఆడవాళ్లని విచ్చలవిడిగా తిరగమన్నాడా ?" అన్నాడు. ఆ మాటలు తనకు గుర్తుండవు. ఇంకా ఏవేవోఅన్నాడు. తను విచ్చలవిడిగా తిరుగుతోందా. ఛీ !

తనని నానా మాటలు అనినప్పుడయినా అంతబాధపడలేదు మధ్యలో లెనిన్ గురించి ఎందుకు? ఆ మహానుభావుడి పేరు ఉచ్చరించడానికైనా తగడు

తన స్నేహితులు రాసిన ఉత్తరాలు చదవొద్దంటే- చాలా చాలా మాట్లాడేడు-

"భార్యా భర్తల మధ్య రహస్యాలుండ కూడదు".

"నీకేం రహస్యాలుండ వన్నావుగా భయం దేనికి?"

"నీకు వచ్చే వుత్తరాల్లో మంచి సాహిత్యం వుంటుంది?" సాహిత్యం కూడా తెలుసు ఈమనిషికి!

కుమార్ ఇతర ఆడవాళ్లతో కూడా తిరుగుతాడని తెలిసి ఎంత అసహ్యం కలిగిందో.

భరించలేక పోయింది.

ఎవరెవరెన్నోముట్టుకున్న చేతుల్తో ఇక తనన్ని ముట్టుకోనివ్వకూడదనుకుంది.

"సోషల్ లైఫ్-ఉద్యోగ ధర్మం-అనేక మందితో మాట్లాడవలసి వస్తుంది"ట!

వాళ్ల ఆఫీసులో టైపిస్టుతో వ్యవహారం గురించి బెదురుతూ చెప్పేడు- చిన్నయ్య, ఆఫీస్ అటెండర్

పాపం ఆయమ్మదేం తప్పునేదట. తప్పంతా ఈనగారిదేనట. గతిలేక. మొగుడు చచ్చి, ఆ యాడకూతురుద్యోగం చేస్తందట. బాగా బతికిన వాళ్లేనట. మహావుంటే ముప్ఫయి లోపేనట. ఇద్దరు పిల్లలట ఈయనే ఆ పిల్లని నానా అల్లరీ చేసి లొంగ దీసుకున్నాడట-

ఈ వివరాలన్నీ తెలుసుకోకూడదనుకుంది. తెలుసుకున్నాక ఎంత అసహ్యం వేసిందో-ఛీఛీ- అలాంటి మనిషితోనా తను కాపరం చేస్తోంది?. తనను తాను కాల్చేసుకుని పుటం పెట్టుకోవాలనుకుంది.

"అమ్మా-నానిలాగన్నానని తమరు మరోలాగనుకోకండి- ఈ బాబు ఎప్పుడో కప్పుడు తినేస్తాడు' అని చెప్పనే చెప్పాడు చిన్నయ్య.

తిన్నాడు.

తను పుట్టింట్లో కనీసం ఓ నెల్లాళ్లయినా వుండి వెళ్దామనుకుంది. వచ్చిన కొద్ది రోజుల్లోనే ఆ కబురు తెలిసింది.

ఇంత త్వరగా బండారం బడట పడుతుందనుకోలేదు. ఈ రకంగా జరుగుతుందనుకోలేదు.

ఇద్దర్నీ గదిలో పెట్టి తలుపులు వేశారట. పెళ్లి చేసుకుంటానని ఒప్పుకుంటేనే తలుపులు తీస్తామన్నారట. నాకు పెళ్లయింది. ఇద్దరు పిల్లలు కూడా వున్నారని మొత్తుకున్నాడట. మాకదేంతెలవదు. ఇప్పుడీ పిల్లబ్రతుకేం కావాలి. తాళి కట్టకపోతే తల తీసేసి పోలీసోళ్లకి పార్శిలు చేస్తామన్నారు. తెల్లవారేవరకు కాపలా కాసి తెల్లారేక గుళ్లో తాళి కట్టించి ఫోటోలు తీయించి నెగిటివ్‌లతో సహా జాగ్రత్త పెట్టుకున్నారట. ఆ అమ్మయికి మూడోనెలని లేడి డాక్టరు దగ్గిర సర్టిఫికెట్లు తీసుకున్నారట. మామీద నువ్వు పోలీసు రిపోర్టిస్తే మేమూ రిపోర్టిస్తాం. కేసు నడిపిస్తాం. కటకటాల్లెక్క పెట్టిస్తాం. మూకుడు కూడు తినిపిస్తాం. అని ఖచ్చితంగా చెప్పేరట.

ఛి ఛీ ఎంత నీచం.

మూడు రోజుల తరవాత వొంట్లో బాగోపోతే ఆస్పత్రికి వెళ్లింది. అమ్మని తీసుకుని.

తనకి మూడోనెలట!

ఓహ్........?!

ఎలా.... ఎలా...... ఎలా......?

ఈ నిప్పుని భరించడం ఎలా.....?

ఈ అశుద్ధం భరించడం ఎలా.....?

ఓహ్.....?

వాళ్లకి నష్టపరిహారం యిస్తానన్నాడట. ఓ పదివేలు పారేసి ఒదిలించుకోవచ్చనుకున్నాడేమో! లక్ష రూపాయలు కావాలన్నారు. ఓ ఆడకూతురు బతుక్కి అదితక్కువ విలువే. అల్లరి పెట్టడం ఇష్టంలేక అక్కడికి దిగేరట.

ఈ పెద్దమనిషి సంపాదించిందతా తాగుడుకూ పేకాటకీ చాలదు. పదివేలు మాత్రం ఎలా ఇస్తాడు. ఏ కాంట్రాక్టర్నో ముంచాలి తప్ప-

నెలనెలా నాలుగు వందలు ఇచ్చుకునేలా మనుషులు ఒప్పందం చేశారట. కానీ అదీ అమలు జరగలేదు.

తను వచ్చిన మర్నాడే నాన్నగారు వెళ్లి పిల్లల్ని తీసుకొచ్చేశారు-

తనకి సృజన పుట్టింది.

అక్కడ-ఆవిడకి కొడుకు పుట్టేడు.

ఇద్దరూ ఆడపిల్లలే పుట్టేరని ఎంత విసుక్కున్నాడో మొదట. తనకి మరో ఆడపిల్ల పుట్టిందని తెలిస్తే ఇంకా విసుక్కుని వుంటాడు.

ఇప్పుడు ఆవిడని తెచ్చి ఇంట్లో వుంచుకున్నాడట. కుమార్ తండ్రి-అంటే తన మామగారు ఎం.ఎల్.ఏ గా పోటీ చేసి ఓడిపోయారు. విశాఖపట్నంలో ఏదో అర్బన్ బ్యాంక్ ఛైర్మనయ్యేరట.

తను ఎన్ని బాధలు పడింది.

తనను ఆదుకునేందుకు అమ్మా నాన్నా అన్నయ్య ఎన్ని బాధలు పడ్డారు-!

చివరకి 'ఉత్తరాంధ్ర' దినపత్రికలో చేరింది. తన బ్రతుకు తను బ్రతుకుతోంది.

తన స్నేహితులు కుమార్‌మీద దావావేస్తామన్నారు. భరణం రాబడతామన్నారు.

తను వద్దంది. పోతే పోనిమ్మంది.

ఆ మనిషి డబ్బుతో తను బ్రతకాలా?

ఛీ– ఎన్నటికీ జరగని పని.

నీలమణి గారితో ఇంటర్వ్యూ ముగించుకుని ఇల్లు చేరేసరికి చాలా ఆలస్యమైంది.

స్నేహలతా. సృజనా నిద్రపోతున్నారు.

వాళ్లకి ఊహ తెలిసినప్పటి నుంచీ క్రమశిక్షణ నేర్పింది.

తనకోసం ఏడవకూడదు. బెంగపెట్టుకోకూడదు. తమ పనులు తామే చేసుకోవాలి.

స్నేహలతకి ఆరేళ్లు.

సృజనకి నాలుగు.

వాళ్ల చిన్నప్పుడు ఆయా వుండేది. సృజనకి మూడేళ్లు నిండాక ఆయా అవసరం తీరిపోయింది.

స్నేహ రిక్షాలో కాన్వెంటుకు వెళ్తోంది.

సృజన ఇరుగు పొరుగు పిల్లల్తో ఆడుకుంటుంది.

ఒకోరోజు అక్కతో కాన్వెంట్‌కు వెళ్లింది. రెండు నెలల నుంచీ సృజన కూడా కాన్వెంట్‌కు పంపిస్తుంది. ఎల్.కే.జీ. క్లాసులో వేసింది.

నిజానికి ఆ కాన్వెంట్ చదువులు తనకిష్టంలేదు. కాని మరో గత్యంతరం లేదు. పగలంతా వాళ్లని ఎవరు చూసుకుంటారు?

ఇంటికి వచ్చాక తనే ఇద్దరికీ చదువు చెబుతుంది. అక్షర జ్ఞానం కంటె లోకజ్ఞానం ఎక్కువ ముఖ్యం.

దేవుడు, దెయ్యం, పెద్దవాళ్లు-మొదలైన భయాలకి దూరంగా పెంచుతోంది.

పెద్దమ్మాయి నిర్మల తాతగారి దగ్గరుంటోంది. నాలుగో తరగతి చదువుతోంది. అయిదు పూర్తయాక తీసుకొచ్చేసి తన దగ్గిరే వుంచుకుంటుందిక.

చెప్పుకుంటే సిగ్గు-

తన ఆర్థిక స్తోమత ముగ్గురు పిల్లల్ని పెంచలేక పోతోంది. నాన్నగారే 'పెద్దమ్మాయిని నా దగ్గిరే వుంచి చదివిస్తాన్లేమ్మా' అన్నారు. తను సరేనంది. మొదట్లో తన మనసు ఎంత కొట్టుకు పోయిందో. ఎంత ఆక్రోశించిందో!

తన "వారు" తనని ఏ దశకు తెచ్చారు?

ముగ్గురూ ఆడిపిల్లలే గనక తనకి వొదిలేశాడు. ఇదే మగ పిల్లలయితే వదిలి వుండునా? ముప్పతిప్పలు పెట్టివుండే వాడు! తన వెంటలాక్కు పోయేవాడు!

'మగతోడు' లేకుండా బ్రతకడం సాధ్యమేనని నిరూపించింది తను-

"పెళ్లి కానితల్లులు" కూడా ధైర్యంగా బ్రతకడం తనకి తెలుసు. అవును పెళ్లి చేసుకోకుండానే తల్లిని చేసి మగ దుర్మార్గులు హాయిగా బ్రతగ్గలిగినప్పుడు ఆడవాళ్లు ఎందుకు బ్రతకలేరు!

నీలమణిగారితో ఇంటర్వ్యూ 'ఉత్తరాంధ్ర' లో వచ్చింది. నీలమణి గారిపై వ్యాసం 'అవగాహన' తాజాసంచికలో రాబోతున్నది. రెండు ఆర్టికల్స్‌లోనూ విషయాలు పునరుక్తి కాకుండా చాలా జాగ్రత్త పడింది.

సాయంత్రం అయిదున్నరయింది.

అపుడే ఆఫీసు నుంచి వచ్చింది. స్నానం చేసి బట్టలు మార్చుకుని కాఫీ తాగి ముందు వరండాలో రాసుకుంటూ కూచుంది సరళ.

పిల్లలిద్దరూ క్వార్టర్స్ చివర గ్రౌండులో ఇతర పిల్లల్తో ఆడుకుంటున్నారు.

ప్రక్కవాటాలో ఒక ఇంజనీరు గారుంటున్నారు. ఇంజనీర్లంటే చచ్చే ఎలర్జీ తనకి. కానీ ఆఫీసుకు దగ్గిర. పిల్లల కాన్వెంట్ దగ్గిర. పోస్టాఫీసుక్కూడా దగ్గిరే. అద్దె మరీ ఎక్కువ కాదు-కనక. తప్పనిసరి పరిస్థితుల్లో ఈ వాటా తీసుకుంది, పొరుగున ఇంజనీరు గారున్నారని తెలిసినా.

ఆ ఇంజనీరు గారింట్లో మొన్నటిదాకా ఓ పిల్ల పనిచేస్తుండేది. పెళ్లయింది మానేసింది.

ఇంజనీరుగారి భార్య కొత్త మనిషితో మాట్లాడుతోంది:

"జీతం ఎంతో తెలుసు కదూ"

"తెలుసమ్మా, ముప్పయి రూపాయలు"

"ఉదయం ఆరులోపునే పనిలోకి రావాలి........."

చాలా సేపు చెప్పింది కండిషన్లు. ఆ మాటలన్నీ వినిపిస్తూనేవున్నాయి.

'ఇదిగో చూడు- మీ ఆయనేం చేస్తుంటాడు?"

ఏ ప్రశ్నతో తను గత నాలుగు రోజులూ అశాంతికి లోనయిందో ఆ ప్రశ్నే వేసింది. ఇంజనీరు భార్య కొత్త పనిమనిషిని.

తప్పదా ఈ ప్రశ్న?

'ఆయన' గురించి తెలుసుకోవడం అంత ముఖ్యమా?

"మెకానిక్ పని చేసీవోడండి. నన్నూ నా బిడ్నీ ఒగ్గేసి ఎలిపోనాడమ్మ."

"అలాగా-"

ఆ తరవాత కాస్సేపు నిశ్శబ్దం. ఇంజనీరు గారి భార్య ఆలోచనల్లో పడి వుంటుంది. ఏదో నేరం చెయ్యకపోతే ఎందుకు వదిలేస్తాడు? ఇది మరెవడితోనో తిరిగి వుంటుంది. లేదా మరేదో చేసి వుంటుంది. ఇటువంటిదాన్ని పనిలో పెట్టుకోవడమా వద్దా అని ఆలోచిస్తూ వుండి వుంటుంది.

"ఏం ఎందుకొదిలేశాడూ-"

"ఏం చెప్పమంటారమ్మగారూ. పోయికాలవండి తాగుడు నావైపోయిందండమ్మా. ఇంటికి ఒక్క పైసా ఇవ్వడం మానీశాడండి. రెండో బిడ్డ పుట్టి సచ్చిపోయి నప్పుడు నాకు మా సెడ్డ జబ్బు చేయిస్సిందండి. సచ్చిపోతాననుకున్నానండమ్మగాదూ సరీగా మందు యిప్పించీవోడు కాడండి మూడు నెలలు మంచం మీదే వుండి పోనానండి. ఆ టయాంలో మరొక దాంతో మరుగడిపోయి దాన్ని నెగదీసుకుని ఎటో పోనాడండి కొందరేమో ఇశాపట్నాన్నే- అంటే ఇందమ్మట గాదండీ- గాజువాకలోనో, మరెక్కడో గాని వున్నాడన్నారండీ. కొందరు రాజమండ్రం పోనాడన్నారండీ నాకాడ లేని కాడికి ఎక్కడికిబోతే నాకెందుకండమ్మగారూ. తమ వంటోరిళ్లకాడ పన్లు చేసుకుని బిడ్నీ పెంచుకుంటున్ననండమ్మ గోరూ-"

ఆ తరువాత అట్టే సంభాషణ సాగలేదు ఆ మనిషి వెళ్లిపోయింది.

మెట్లు దిగివెళిపోతున్న ఆ మనిషిని సరళ చూసింది. మహావుంటే ముప్పయ్యేళ్లుంటాయేమో- చాలా సన్నంగా, కొంచెం పొడుగ్గా రివటలా వుంది. చంకన ఓ ఆడపిల్లుంది. చింపిరి జుట్టుతో సుమారు మూడేళ్లుండొచ్చు. చిరుగుపట్టిన ముతకచీర. చేతులకి రంగుపోయిన గాజులు. నుదుట ఇంత కుంకం బొట్టూ-

ఆ రోజు ఈ పాటి ధైర్యంగా తను సమాధానం చెప్పలేకపోయింది. చదువురాని 'పాటక' జనం పాటి ధైర్యం మధ్యతరగతి చదువుకొన్న జనానికి వుండదుగావును-

తనవంటి వారు సమస్యల్ని భూతద్దంలోంచి చూస్తున్నారా? లేక సమస్యల్ని సరిగ్గా ఎదుర్కోలేక గందరగోళం సృష్టించుకుంటున్నారా?

తన భర్త నుంచి తను వేరయిందనీ. అతనొక తాగుబోతూ, వ్యభిచారీ. నీచుడూననీ అతనితో కలిసి జీవించడం సాధ్యంకాని పననీ, కనుకనే తను విడిగా ఉద్యోగం చేస్తూ తన కాళ్ల మీద తను నిలబడి బ్రతుకుతోందనీ ఎందుకు చెప్పలేకపోయింది?

తండ్రిద్వారానో భర్త ద్వారానో మరెవరో పురుషుడి ద్వారానో తప్ప విడిగా స్త్రీకి గుర్తింపు లేదా? అని ఎందుకు ఎదురు ప్రశ్న వెయ్యలేక పోయింది?. ఈ సారి తననెవరయినా 'మీ వారేం చేస్తుంటారు?' అని అడిగితే-ఖచ్చితంగా సమాధానం చెబుతుంది. సందేహం దేనికి? భయం దేనికి?

*రచన : 9-10-89 – 13-10-89 మధ్యకాలం*

*ప్రచురణ : రచన, జూన్ 1992.*